

సాక్షి పల్నాడు

మంగళవారం : 27 : మే : 2025



ప్రత్యేక పూజలు

మాచర్ల: శ్రీ గంగా పార్వతి నగరేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం అర్చకులు వంశీకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో పలువురు దంపతులు పాల్గొన్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 512.60 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,598 క్యూసెక్కులు విడుదలవుతోంది.

వైభవంగా అమావాస్య హోమం



చందోలు(కర్లపాలెం): చందోలులోని బగళాముఖి అమ్మవారి ఆలయంలో 76వ అమావాస్య హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి శరభ కాళేశ్వరి మహాదేవి అలంకరణ చేశారు.

న్యూస్‌రీల్

జూన్ 2న మాచర్ల మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక

మాచర్ల: మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కార్యక్రమాన్ని జూన్ 2న మాచర్ల పురపాలక సంఘ కౌన్సిల్ హాలులో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.వేణుబాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న తురకా కిషోర్‌ను తొలగిస్తూ పురపాలక సంఘం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వైస్ చైర్మన్ పదవి కూడా ఖాళీ అయింది. ఈనేపథ్యంలో ఈ రెండు పదవులకు సంబంధించి ఎన్నిక నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గురజాల ఆర్డీవో మురళి ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియ నిర్వహించనున్నారు. కౌన్సిల్ సభ్యులంతా తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

రోడ్డుపై అధికారుల యోగాసనాలు



నరసరావుపేట: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం పెద్దచెరువు కలెక్టరేట్ బంగ్లా రోడ్డులో అధికారులు యోగాభ్యాసం చేశారు. యోగాపై ప్రజలకు అవగాహన నిమిత్తం నడిరోడ్డుపై ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ జేవీ సంతోష్, డీఎస్పీ కె.నాగేశ్వరరావు, ఇతర పోలీసు, రెవెన్యూ అధికారులు పాల్గొని యోగా చేశారు.

సమస్యలను టోల్‌ఫ్రీ నెంబర్ 1100 ద్వారా నమోదు చేసుకోండి

నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు సంబంధించిన ఫిర్యాదులను నేరుగా సోమవారం నరసరావుపేట కలెక్టరేట్, ఆయా మండలాల్లో సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. దీనికి హాజరు కాలేనివారు టోల్ ఫ్రీ నెంబర్ 1100కు ఫోన్‌చేసి ఫిర్యాదులు నమోదు చేయించుకోవచ్చని తెలిపారు. ఇచ్చిన ఫిర్యాదులకు సంబంధించిన స్థితిని తెలుసుకునేందుకు పై టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అర్జీలు నమోదు చేసుకోవడానికి (మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వీ డాట్ ఇన్) వెబ్‌సైట్‌లో నేరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

వాహనాల దొంగలు అరెస్ట్



మంగళగిరి: మంగళగిరి రూరల్ పోలీసులు వివిధ వాహనాలను చోరీ చేసే నిందితులను అరెస్ట్ చేశారు. రూరల్ సీఐ వై. శ్రీనివాసరావు సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. ద్విచక్ర వాహనాలు, మోటారు వాహనాలను చోరీ చేస్తున్న కన్నా గోపి, ఎస్కే సర్దార్‌లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి టాటా ఏస్ వాహనం ఒకటి, 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్, మహేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గురజాల డీఎస్పీగా జగదీష్

గురజాల : గురజాల డీఎస్పీగా బి. జగదీష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఏప్రిల్ 10వ తేదీన గురజాల డీఎస్పీగా ఉన్న జగదీష్‌ను కొన్ని రాజకీయ కారణాలతో డీఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అప్పటి నుంచి గురజాల ఇన్‌చార్జి డీఎస్పీగా సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు వ్యవహరిస్తున్నారు. గురజాల డీఎస్పీ పరిధిలో గురజాల, మాచర్ల నియోజకవర్గాలు ఉన్నాయి. ఇవి రెండు అత్యంత కీలకంగా ఉండటంతో తిరిగి జగదీష్‌ను డీఎస్పీగా కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అభయాంజనేయుడి హుండీ ఆదాయం రూ.10.80 లక్షలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ.10.80 లక్షలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి పితాని తారకేశ్వరరావు తెలిపారు. దేవస్థానం కార్యాలయ ప్రాంగణంలో సోమవారం దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో స్వామివారి హుండీ ఆదాయం లెక్కించారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.సురేష్ కుమార్ పర్యవేక్షణాధికారిగా వ్యవహరించారు. గత 67 రోజులకు రూ. 10,80,452 వచ్చినట్లు వివరించారు. ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్త మండలి సభ్యులు హుండీ కానుకల లెక్కింపులో పాల్గొన్నారు.

విద్యాశాఖ బదిలీలలు

- శారీరక వైకల్యంతో బాధపడుతున్న వారిపై కనీస మానవత్వం కరవు
- 25 ఏళ్లుగా అమలులో ఉన్న ప్రిఫరెన్షియల్ కేటగిరీపై ఆంక్షలు
- ఉపాధ్యాయ బదిలీలకు నేటితో ముగియనున్న గడువు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాఖలైన దరఖాస్తులు 6,870
- లాంగ్ స్టాండింగ్‌లో తప్పనిసరి బదిలీ కావాల్సిన హెచ్‌ఎంలు, టీచర్లు 4,143 మంది

బదిలీలకు అవకాశం ఇచ్చి.. కఠిన నిబంధనలతో మోకాలొడ్డి..



ఆన్‌లైన్‌లో బదిలీకి దరఖాస్తు చేసుకుంటున్న ఉపాధ్యాయులు

గుంటూరుఎడ్యుకేషన్: బదిలీలకు తెరలేచిందనే ఆనందం ఉపాధ్యాయుల్లో ఎక్కువ కాలం నిలిచేలా లేదు. ఎందుకంటే బదిలీకి అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ప్రభుత్వం విధించిన కఠిన నిబంధనలతో కోరుకున్న పాఠశాలకు వెళ్లడం గగనమవుతోంది. ఒకవైపు బదిలీలు చేపడుతున్నామంటూనే మరో వైపు గతంలో ఎన్నడూ లేని రీతిలో విధించిన నిబంధనలతో ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియలో భాగంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ మంగళవారం ముగియనుంది. ఇందుకు సంబంధించి జీఓ 22 ద్వారా విడుదల చేసిన మార్గదర్శకాలతో ఉపాధ్యాయులు బెంబేలెత్తుతున్నారు. పుట్టుకతో శారీరక వైకల్యానికి గురైన ఉపాధ్యాయులకు ప్రిఫరెన్షియల్ కేటగిరీ ద్వారా వారు కోరుకున్న పాఠశాలకు వెళ్లే సదుపాయంపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. శారీరక వైకల్యం 70 శాతం లోపు ఉంటే ప్రాధాన్యత క్రమంలో పాయింట్లు, 70 శాతానికి పైగా ఉంటే ఎటువంటి ఆంక్షలు లేకుండా ప్రిఫరెన్షియల్ కేటగిరీలో సంబంధిత ఉపాధ్యాయులు వారు పని చేస్తున్న పాఠశాలలకు బదిలీపై వెళ్లవచ్చు. గత 25 ఏళ్లకు పైగా అమల్లో ఉన్న ఈ విధానాన్ని మార్చివేసి ఎస్జీటీలకు 40 శాతం, స్కూల్ అసిస్టెంట్లకు 50 శాతం సీలింగ్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు.

కక్షపూరితంగానే..!

శారీరక వైకల్యంతో బాధపడుతున్న వారిపై కనీస మానవత్వం లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. బదిలీల ప్రక్రియలో భాగంగా ఒకే పాఠశాలలు ఐదు విద్యాసంవత్సరాలు పూర్తి చేసుకున్న గ్రేడ్–2 హెచ్‌ఎం, ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు బదిలీ తప్పనిసరి.

- ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం ఒకరు లేక ఇద్దరు ఎస్జీటీలు ఉన్న ప్రాథమిక పాఠశాలలకు లాంగ్ స్టాండింగ్ విధానంలో బదిలీపై వెళ్లేందుకు పీహెచ్ కేటగిరీ ఉపాధ్యాయులకు అవకాశం లేదు. ముగ్గురి కంటే ఎక్కువ ఉపాధ్యాయులు ఉంటేనే సదరు పాఠశాలలను కోరుకోవాలని లేకుంటే మరో పాఠశాలకు వెళ్లాలంటూ ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రభుత్వం, సీలింగ్ పరిధికి మించిన పాఠశాలలను బ్లాక్ చేసింది.
- పుట్టుకతో అంధత్వం, వినికిడి లోపంతో పాటు నడవలేని స్థితిలో ఉన్న ఉపాధ్యాయులకు గతంలో తాము పని చేస్తున్న పాఠశాలల్లోనే బదిలీ కాకుండా ఉండటంతో పాటు కోరుకున్న చోటకు బదిలీపై వెళ్లే అవకాశం ఉండేది. అయితే ప్రస్తుతం ఈ సదుపాయం లేకుండా ప్రిఫరెన్షియల్ కేటగిరీకి ప్రభుత్వం కొత్త భాష్యం చెబుతోంది.
- శారీరక వైకల్యంతోపాటు దీర్ఘకాలిక జబ్బులు, కేన్సర్, గుండె జబ్బులతో బాధపడుతున్న ఉపాధ్యాయులు హైస్కూళ్లలో సింగిల్ సబ్జెక్టు టీచర్లుగా బదిలీపై వెళ్లేందుకు అవకాశం లేకుండా చేశారు. అంధ, వినికిడి లోపం, నడవలేని స్థితిలో ఉన్నవారికి సైతం కోరుకున్న పాఠశాలలకు వెళ్లే అవకాశం లేకుండా కఠిన నిబంధనలు విధించారు. ప్రతి మండలంలో 15 వరకు ఖాళీలు ఉండగా, వాటిలో కేవలం ఐదు స్థానాలు మాత్రమే కోరుకునే విధంగా ఉంచి, మిగిలిన వాటిని బ్లాక్ చేశారు.
- దూరప్రాంతాల్లో మగ్గుతూ వైద్య సదుపాయాల కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లాలని ఆశపడుతున్న టీచర్లకు మొండిచెయ్యి చూపారు. భర్త చనిపోయిన మహిళా ఉపాధ్యాయులకు విడాకులు తీసుకున్న ఉపాధ్యాయినులకు సైతం నిరాశే ఎదురవుతోంది. అనారోగ్యంతో బాధపడుతున్న పిల్లలు ఉన్న ఉపాధ్యాయులకు సైతం అన్యాయానికి గురవుతున్నారని ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన నెలకొంది. ఆర్థికంగా భారం లేని బదిలీల ప్రక్రియపై ప్రభుత్వం ఎందుకింత కఠినంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంఘాలతో జరిపిన చర్చలకు, మార్గదర్శకాలకు పొంతన లేదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 6,870 దరఖాస్తులు

ఉపాధ్యాయ బదిలీల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మంగళవారం ముగియనుండగా, సోమవారం నాటికి ఉమ్మడి గుంటూరు జిల్లాలో 6,870 మంది ఉపాధ్యాయులకు బదిలీలకు దరఖాస్తు చేశారు. వీరిలో లాంగ్ స్టాండింగ్‌లో తప్పనిసరి బదిలీ కావాల్సిన హెచ్‌ఎంలు, టీచర్లు 4,143 మంది ఉన్నారు.

వైకల్యంతో పుట్టడం మా తప్పా ?



నేను గుంటూరు రూరల్ ఓబులనాయుడుపాలెంలోని ఎంపీయూపీఎస్‌లో పని చేస్తున్నాను. 70 శాతానికి పైగా శారీరక వైకల్యానికి గురైన నేను బదిలీల్లో గుంటూరుకు సమీపంలోని పాఠశాలలకు వెళ్లేందుకు అవకాశం లేకుండా చేశారు. ఉపాధ్యాయ బదిలీల చట్టంలో లేని విధంగా జీఓలో అనేక కఠిన నిబంధనలు విధించారు. శారీరక వైకల్యంతో జన్మించడం నా తప్పిదమా ? మానవత్వాన్ని చూపాల్సిన ప్రభుత్వం, అధికారులు ఈ విధంగా నిబంధలు విధించి పీహెచ్ కేటగిరీ ఉపాధ్యాయులకు అన్యాయం చేయడం తగదు.

– పి.నాగశివన్నారాయణ, ఎస్జీటీ, గుంటూరు

మానవత్వం లేకుండా మార్గదర్శకాలు



బదిలీల మార్గదర్శకాల్లో విద్యాశాఖాధికారులు ఇష్టారాజ్యంగా నిబంధనలు విధించారు. పీహెచ్ కేటగిరీతోపాటు ప్రిఫరెన్షియల్ కేటగిరీకి చెందిన ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం చేస్తూ పాఠశాలల్లో ఖాళీలను బ్లాక్ చేశారు. శారీరక వైకల్యానికి గురైన ఉపాధ్యాయుల కోసం కేంద్ర ప్రభుత్వం తెచ్చిన పీడబ్ల్యూడీ చట్టానికి వ్యతిరేకంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. వైకల్యాన్ని అధిగమించి, ఎంతో కష్టపడి చదువుకుని ఉద్యోగం పొందిన వారిపై మానవత్వంతో వ్యవహరించాల్సినదిపోయి ఈ విధంగా కఠిన నిబంధనలు విధించడం దుర్మార్గం. – కె.బసవలింగారావు, జిల్లా అధ్యక్షుడు, ఏపీటీఎఫ్

పొగాకు రైతుకు అండగా వైఎస్సార్ సీపీ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పానెం చిన హనిమి రెడ్డి

అద్దంకి: పొగాకు రైతుకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 28న పొగాకు రైతుల సమస్యలు తెలుసుకోవడం కోసం పొదిలి వస్తున్నారని చెప్పారు. దీనికి సంబంధించి బాపట్ల జిల్లాలోని స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న రైతులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం నల్ల బర్లీ సాగు చేసిన రైతు పరిస్థితి జీవన్మరణ స్థితిలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వైపు దిగుబడులు పడిపోవడం, మరో వైపు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో తెలుస్తోందన్నారు. ఆదుకోవాలని ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా స్పందించలేదన్నారు. అందుకే పొగాకు రైతుల తరఫున పోరాటం చేసేందుకు, వారికి ధైర్యం కల్పించేందుకు జగన్ పొదిలి రానున్నట్లు చెప్పారు. అయితే టీడీపీ నాయకులు, అక్కడ హడావుడి చేసే పరిస్థితి కనిపిస్తోందన్నారు. కానీ తమ నేత అనుకున్న కార్యక్రమం పూర్తి చేస్తారని స్పష్టం చేశారు. చేతనైతే రైతులకు సాయం చేసే విధంగా ఉండాలే తప్ప వారికి మేలు జరిగే పనిని అడ్డుకోవాలనుకుంటే ప్రజలు బుద్ధి చెప్పి తీరుతారన్నారు. తమ పార్టీ తరఫున ఉద్యమం చేయడానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, రాష్ట్ర బూత్ కమిటీ జాయింట్ సెక్రటరీ పులికం కోటిరెడ్డి, ప్రచార కమిటీ జాయింట్ సెక్రటరీ కె.అంకారావు ఉన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

ప్రజల నుంచి 171 అర్జీలు స్వీకరించిన కలెక్టర్, అధికారులు



అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్య వింటున్న కలెక్టర్, జేసీ, డీఆర్‌ఓ, అధికారులు

నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు అధ్యక్షత వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 171 అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. జాయింట్ కలెక్టర్ సూరజ్, డీఆర్‌ఓ ఏకా మురళి, డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగుడి సమస్య తెలుసుకున్న కలెక్టర్

బొల్లాపల్లికి చెందిన ఎం.సుధాకర్ అనే దివ్యాంగుడు పింఛన్ కోసం వీల్‌చైర్‌లో వచ్చాడు. కలెక్టర్ స్వయంగా అతని వద్దకు వెళ్లి సమస్య అడిగి తెలుసుకొని సెర్ప్ సీఈవోతో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.




స్వయంగా సుధాకర్ అనే దివ్యాంగుడి సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్

తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి


విశాఖ ఉక్కు పరిశ్రమలో తొలగించిన రెండు వేలమంది కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకొని వారికి బకాయి వేతనాలు చెల్లించాలి. పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వెంటనే ఆపి ఉత్పత్తి పెంపునకు చర్యలు తీసుకోవాలి.

– సీఐటీయూ నాయకులు



కలెక్టర్ కార్యాలయం ముందు నినాదాలు చేస్తున్న వామపక్ష నాయకులు

విద్యుత్ లైను పనులు అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోండి



బొల్లాపల్లి మండలం గండిగనుముల గ్రామంలో 50 సుగాలీ కుటుంబాల కోసం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్ పనులు అడ్డుకుంటున్న వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. వారు ఇప్పటివరకు సింగిల్ ఫేస్‌తో లోఓల్టేజ్ కారణంగా ఇబ్బందిపడుతుండగా త్రీ ఫేస్ సౌకర్యం కలిగించేందుకు పనులు చేపట్టారు. లైను వేయకుండా స్థానిక రామావత్ రామునాయక్, విద్యుత్ లైన్‌మెన్ రామావత్ బాలాజీ నాయక్, పోస్టుమాస్టర్ తవ్వా నాయక్ అడ్డుకుంటున్నారన్నారు. అవసరమైతే ప్రాణాలైనా తీస్తామని వారు బెదిరిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోండి.

– ప్రజాసంఘాల నాయకులు

రైతులను ఆదుకోవాలి

రైతులు పండించిన పొగాకు, కందులు, మిర్చి పంటలకు తగిన ధర కల్పించకుండా ప్రభుత్వం గాలికి వదిలేసింది. మూడు నెలల నుంచి పొగాకు కొనటం లేదు. గతేడాది రూ.20వేలు పలికిన మిర్చి ప్రస్తుతం రూ.8వేలు, రూ.9వేలు మాత్రమే ఉంది. కోసిన కూలీలకు సరిపోవట్లేదు. కందులు రూ.4వేలు కంటే ధర పలకటం లేదు. వెంటనే సరైన ధరలు కల్పించి రైతాంగాన్ని ఆదుకుని ఆత్మహత్యలు లేకుండా చూడాలి.

– ఏపీ రైతు సంఘ నాయకులు



కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఏపీ రైతు సంఘ నాయకులు

కమ్యూనిటీ హాలు నిర్మాణం పూర్తిచేయండి

గ్రామంలో ప్రజలకు ప్రయోజనకరంగా ఉండే కమ్యూనిటీ హాలు నిర్మాణాన్ని పూర్తిచేయాలి. దీనికోసం దాతలు రూ.5లక్షలు ఇచ్చారు. కేవలం పిల్లర్ల వరకు నిర్మించి ఏడాది నుంచి వదిలేశారు. వెంటనే మిగతా నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి.

–పెట్లూరివారిపాలెం గ్రామ ఎస్సీ కాలనీ వాసులు

తారస్థాయికి చేరిన కూటమి కుట్రలు

- ఏమాత్రం సంబంధంలేని కేసుల్లో వైఎస్సార్‌సీపీ నేతలను ఇరికిస్తున్నారు
- గుండ్లపాడు హత్యలు పూర్తిగా టీడీపీ వర్గపోరుతోనే జరిగాయి
- కావాలనే పిన్నెల్లి సోదరులపై అక్రమ కేసులు నమోదు
- మాజీ మంత్రి విడదల రజిని



సాక్షి, నరసరావుపేట: ప్రజల కోసం పోరాటం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను టార్గెట్ చేస్తూ కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలు తారస్థాయికి చేరాయని మాజీ మంత్రి విడదల రజిని వ్యాఖ్యానించారు. పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిలపై వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసిన నేపథ్యంలో సోమవారం ఆమె స్పందించారు. గుండ్లపాడులో జరిగిన డబుల్ మర్డర్ పూర్తిగా టీడీపీలో ఆధిపత్యపోరుతో జరిగిందని ప్రత్యక్షసాక్షులు, పోలీసులు చెబుతున్నా ప్రభుత్వం కావాలనే పిన్నెల్లి సోదరులపై అక్రమ కేసు నమోదు చేసిందన్నారు. హత్య జరిగిన ప్రదేశంలో చంపడానికి ఉపయోగించిన జేబీఆర్ పేరుతో టీడీపీ నేత కారు దొరికినా ఇంకా వైఎస్సార్‌సీపీపై నెపం వేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. గతంలో తోట చంద్రయ్య హత్య విషయంలోనూ ఇలానే శవరాజకీయాలు చేశారని గుర్తు చేశారు. ఇప్పటికే పిన్నెల్లిపై అనేక అక్రమ కేసులతో వేధించారని మరోసారి ఆయనపై అక్రమ కేసులు బనాయించడం దారుణమన్నారు. ఇంత బరితెగించి గతంలో ఏన్నడూ అక్రమ కేసులు పెట్టిన దాఖలాలు లేవన్నారు. పోలీసులు సైతం ప్రజాప్రతినిధుల ఒత్తిడికి తలొగ్గి అక్రమ కేసులు నమోదు ఆ శాఖకు మాయని మచ్చగా నిలుస్తుందన్నారు. ఈ విషమ సంస్కృతిని కూటమి ప్రభుత్వం విడనాడాలని లేకపోతే భవిష్యత్తులో వీటన్నింటికి సమాధానాలు చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలకు అండగా నిలిచి వారిని కాపాడుకుంటామన్నారు.

పిన్నెల్లి సోదరులపై హత్య కేసు ఉపసంహరించాలి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామంలో హత్యకు గురైన ఇద్దరు టీడీపీ కార్యకర్తల కేసులో పిన్నెల్లి సోదరులపై బనాయించిన అక్రమ కేసును బేషరతుగా ఉపసంహరించుకోవాలని నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దీనిపై న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. నరసరావుపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో జెవిశెట్టి వెంకటేశ్వర్లు, అతని సోదరుడు కోటేశ్వరరావులను టీడీపీలోని ప్రత్యర్థులు జెవిశెట్టి శ్రీనివాసరావు, తోట వెంకటరామయ్యలు హత్య చేశారని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు స్వయంగా ప్రకటించారన్నారు. ఆ గ్రామంలో టీడీపీలోని రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరులో భాగంగానే ఈ హత్యలు జరిగాయని ఎస్పీ ఒక వీడియోను మీడియాకు రిలీజ్ చేశారన్నారు. తోట చంద్రయ్య హత్యతో ఈ హత్యకు ఎటువంటి సంబంధంలేదని కూడా ఎస్పీ చెప్పడం జరిగిందన్నారు. ఈ నేరానికి సంబంధించిన ఐదుగురు నిందితులను కూడా అరెస్ట్ కూడా చేశారన్నారు. ఆ విధంగా జరిగిన హత్యలపై ఎస్పీ చెప్పిన తర్వాత కూడా నాలుగు సార్లు శాసనసభ్యుడిగా, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులుగా, ప్రభుత్వ విప్‌గా పనిచేసిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపైన, ఒక ఏడాది కాలంగా ఊళ్లోలేని, ఎక్కడున్నాడో కూడా తెలియని అతని తమ్ముడు వెంకటరామిరెడ్డిపై కేసు బనాయించడం సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేలా ఉందన్నారు. చనిపోయిన వారు, చంపిన వారు ఇద్దరు టీడీపీ వారేనని అందరూ చెప్పుకుంటున్నారన్నారు. ఇది కేవలం కక్ష సాధింపు ధోరణితోనే ఇటువంటి చర్యలు చేపడుతున్నారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. గురజాల సబ్ డివిజన్‌లో రెండు నెలల నుంచి డీఎస్పీ లేడని, ఎందుకు పోస్టింగ్ వేయలేకపోతున్నారని ప్రశ్నించారు. గ్రామంలో పల్లెనిద్ర చేసిన ఎస్పీ, ఇన్‌చార్జి డీఎస్పీ అక్కడ సమస్యలు విని మీకు ఏమైనా సమస్యలు ఉంటే జెవిశెట్టి వెంకటేశ్వర్లుకు చెప్పమని కూడా చెప్పారన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకూడదని ఉద్దేశంతో ఎస్పీ, డీఎస్పీ, ఇంత మంది పోలీసు ఉన్నతాధికారులు స్వయంగా వెళ్లి చెప్పినప్పటికీ ఈ హత్యలు జరిగాయంటే దీనికి పోలీసుల బాధ్యతలేదా అని ప్రశ్నించారు. ఒక గ్రామంలో రెండు గ్రూపుల మధ్య ఆధిపత్య పోరు జరుగుతుంటే టీడీపీ నాయకుడు ఏం చేస్తున్నాడని ప్రశ్నించారని ప్రశ్నించారు. ఈ హత్యను అరెస్టు చేసిన ఆ ఐదుగురు నిందితులే చేశారని ప్రత్యక్ష సాక్షి మృతుల బావమరిది స్వయంగా చెప్పాడని అన్నారు. దీనిపై హైకోర్టు కూడా వెళ్తామని తెలియజేస్తూ, తప్పుడు కేసులు పెట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు.

విద్యుత్ బకాయిలు వసూలు చేయండి

అధికారులతో సమీక్ష చేసిన సీపీడీసీఎల్ చైర్మన్, ఎండీ పుల్లారెడ్డి

నరసరావుపేట: వినియోగదారులకు మెరుగైన సేవలతోపాటు విద్యుత్ బకాయిలను వసూలు చేసి సంస్థ ప్రగతికి తోడ్పడాలని సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (సీపీడీసీఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పుల్లారెడ్డి కోరారు. నూతనంగా ఏర్పడిన జిల్లాల పర్యవేక్షణలో భాగంగా సోమవారం పల్నాడు సర్కిల్‌ని సందర్శించారు. జొన్నలగడ్డలోని సర్కిల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష చేశారు. పలు విషయాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అలాగే విద్యుత్ జేఏసీ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి కార్మికుల సమస్యలు తీర్చాలని, నూతనంగా ఏర్పడిన సర్కిల్‌లో శాశ్వత ఉద్యోగులను నియమించాలని కోరారు. పల్నాడు జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.విజయకుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్.రాంబట్లు, ఆర్ బంగారయ్య, అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన చైర్మన్ పుల్లారెడ్డి

క్లుప్తంగా

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



అచ్చంపేట: మండలంలోని గింజుపల్లి వద్ద కృష్ణానదిలో ఈతకెళ్లిన వ్యక్తి ఆదివారం గల్లంతైన విషయం తెలిసిందే. కాగా అచ్చంపేట సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చేపల పడవల ద్వారా ఈతగాళ్ల సహాయంతో విస్తృత గాలింపు చర్యలు చేపట్టగా రాత్రి 9.30 సమయంలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. నకరికల్లు మండలం చాగల్లు గ్రామానికి చెందిన ఆలపర్తి సైదారావు(43) మాదిపాడు పంచాయతీ పరిధిలోని సత్తెమ్మతల్లి దేవాలయం వద్ద మొక్కుబడులు తీర్చుకుని సమీపంలోని గింజుపల్లి వద్ద కృష్ణానదిలో తన స్నేహితులతో కలసి ఈతకొట్టేందుకు వెళ్లి గల్లంతయ్యాడు. అచ్చంపేట సీఐ కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



క్రోసూరు: మండలంలోని విప్పర్ల, ఊటుకూరు గ్రామాల ప్రధాన రహదారిపై ఒంటిపై తీవ్ర గాయాలపై వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెంది ఉండడం కలకలం రేపింది. స్థానికుల సమాచారం మేరకు అచ్చంపేట సీఐ శ్రీనివాసరావు, క్రోసూరు ఎస్ఐ పి.రవిబాబులు ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు జరిపారు. మృతుడు క్రోసూరు మండలంలోని అనంతవరం గ్రామానికి చెందిన కుంభా సాంబశివరావు(35)గా గుర్తించారు. తన ద్విచక్ర వాహనం పక్కన ఒంటిపై తీవ్ర గాయాలతో చొక్కా లేకుండా పడి ఉండటాన్ని గమనించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. క్లూస్‌టీం, డ్వాగ్ స్క్వాడ్‌ను తెప్పించారు. కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. మృతుడు పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరుకు చెందిన వాడు. క్రోసూరు మండలంలోని అనంతవరం గ్రామానికి చెందిన అనంతమ్మను వివాహం చేసుకుని సుమారు 10 సంవత్సరాల నుంచి అనంతవరంలోనే ఉంటున్నట్లు తెలిపారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

- జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు
- పోలీసు పీజీఆర్ఎస్‌కు 75 ఫిర్యాదులు

నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పీజీఆర్ఎస్‌కు అధ్యక్షత వహించి ప్రజల నుంచి కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు, మోసం, చోరీలు తదితర సమస్యలకు సంబంధించిన 75 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదుదారుని సమస్యను శ్రద్ధగా విని, నిర్ణీత గడువులోగా ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషిచేయాలని అధికారులను ఆదేశించారు.



ఫిర్యాదుదారుల సమస్యలు ఆలకిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

పొలాన్ని ఆక్రమించారు

కోనూరు ఇసుక రీచ్‌లో అక్రమంగా ఇసుక తోడుతుంటే నేను ఆర్డీఓ, కలెక్టర్‌లకు ఫిర్యాదు చేశాను. ఈ పనిచేశానని ఎమ్మెల్యే అనుచరులు నాపై కక్ష కట్టి, నా మూడెకరాల పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నారు. కౌలు రైతులను బెదిరిస్తున్నారు. వెంటనే వారిపై చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయండి.

–శాఖమూరి శ్రీనివాసరావు, కోనూరు, అచ్చంపేట

ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం

అగ్రికల్చరల్ డిపార్టుమెంట్‌లో నెలకు రూ.50వేలు జీతం వచ్చే ఉద్యోగం ఇప్పిస్తానని బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం సజ్జాపురం గ్రామానికి చెందిన వేల్పుల కాటంరాజు మహారాష్ట్ర రాష్ట్రంలోని కొల్లాపూర్‌కు రమ్మని చెప్పాడు. అక్కడికి వెళ్లిన నాకు ఇంటర్వ్యూ నిమిత్తం నా వద్ద నుంచి రూ.15వేలు ఫీజు కట్టించుకున్నాడు. ఒక నెల ట్రైనింగ్ ఇస్తామని చెప్పి, ట్రైనింగ్ లాంటివేమీ ఇవ్వకుండా మోసం చేశాడు. అతనిపై చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయండి.

– నర్రా వేణుబాబు, ఇనిమెళ్ల, ఈపూరు మండలం

బ్యాంకు రుణాలు ఇప్పిస్తానని మోసం

నాకు నారాయణమూర్తి పరిచయమై వినుకొండలోని జీడీఎస్ బ్యాంకులో పని చేస్తున్నానని నమ్మించి నాతో పాటు తొమ్మిది మందికి రుణం ఇప్పిస్తానని చెప్పి ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.15వేలు తీసుకున్నాడు. మమ్మల్ని 15 రోజులపాటు గుంటూరుకు తిప్పి చివరకు లోన్ ఇప్పించకుండా తీసుకున్న డబ్బులు ఇవ్వకుండా మోసం చేశాడు. అతడిని డబ్బులు అడిగితే ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ ఇబ్బంది పెడుతున్నాడు. అతనిపై చర్యలు తీసుకొని మాకు డబ్బులు ఇప్పించండి.

– బొప్పూరి రిబ్కా, వినుకొండ

పిన్నెల్లి సోదరులపై హత్య కేసు మోపడం దారుణం

వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ శివనాగేశ్వరరావు



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలోని జంట హత్యల కేసులో పిన్నెల్లి సోదరులపై హత్యా కేసు మోపడం దారుణమని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ, సీనియర్ న్యాయవాది రాజారపు శివనాగేశ్వరరావు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇరువురు టీడీపీ కార్యకర్తలైన జెట్టి వెంకటేశ్వర్లు అలియాస్ మొద్దయ్య, ఆయన సోదరుడు కోటేశ్వరరావులను ఈ నెల 24న పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలంలోని బోదేలవీడు – మండాది గ్రామాల మధ్య జరిగిన హత్యలు టీడీపీలోని రెండు వర్గాల ఆదిపత్య పోరులో భాగంగా జరిగాయని, ఈ విషయాన్ని ప్రత్యక్ష సాక్షి చెబుతున్నా.. పోలీసులు పట్టించుకోకుండా రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారం మాచర్ల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిపై అక్రమంగా, అన్యాయంగా హత్యానేరం మోపడం దారుణమైన విషయమన్నారు. ఈ కేసుకు పిన్నెల్లి సోదరులకు ఏ విధమైన సంబంధం లేదని, తెలుగుదేశం పార్టీలోని రెండు వర్గాలకు గతం నుంచే ఆదిపత్య పోరు ఉందని ఒక వర్గంపై మరొక వర్గం గతం నుంచే గొడవలు పడే వారని గ్రామస్తులు చెబుతున్నా పోలీసు అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు.

హామీల అమలుపై దృష్టి మరల్చేందుకే..

రాష్ట్రంలోని 175 నియోకవర్గాలల్లోని వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టించడమే రెడ్ బుక్ రాజ్యాంగం అమలులో భాగమని విమర్శించారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో తల్లికి వందనం ఇస్తానని, రైతులకు అన్నదాత సుఖీభవ ఇస్తానని, మహిళలకు 3 గ్యాస్ సిలెండర్లు ఇస్తానని, మహిళలకు ఫ్రీ బస్ సౌకర్యం ఏర్పాటు చేస్తానని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తానని, ప్రతి మహిళకు నెలకు రూ.1,500 నగదు ఇస్తామని, ఇంటింటికి సూపర్ సిక్స్ పేరు చెప్పి మాయమాటలతో అధికారంలోనికి వచ్చిన కూటమి నేడు ఆ హామీలు ఒక్కటైనా అమలు చేయకుండా, ప్రజల దృష్టి మరల్చేందుకే ఇటువంటి డ్రామాలు ఆడుతోందని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు చేసే అక్రమాలు, అన్యాయాలను ప్రజలు గమనిస్తున్నారని వాటికి త్వరలోనే మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరించారు.

ముస్లింల చైతన్యానికి రాజకీయ వేదిక

ఉమ్మడి గుంటూరు జిల్లా ఎంయూఎఫ్ ముఖ్యనేతల నిర్ణయం

తెనాలి: ప్రస్తుత పరిస్థితుల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాలో ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ (ఎంయూఎఫ్)ను బలోపేతం చేసుకుంటూ అనుబంధంగా రాజకీయ చైతన్య వేదికను ఏర్పాటు చేయాలని ఎంయూఎఫ్ ముఖ్యనేతల సమావేశం తీర్మానించింది. ఉమ్మడి గుంటూరు జిల్లా ఎంయూఎఫ్ ముఖ్యనేతల సమావేశం ఆదివారం స్థానిక చినరావూరులోని సీనియర్ నేత షేక్ ఖలీల్ అధ్యక్షతన జరిగింది. ప్రస్తుత రోజుల్లో ఎంయూఎఫ్ ఆవశ్యకత అనే అంశంపై జరిగిన సమావేశానికి ఆ సంస్థ అధ్యక్షుడు ఎండీ కలీం ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ గత 28 ఏళ్లగా పార్లమెంట్ వ్యవస్థను విశ్వసిస్తూ, ప్రజాస్వామ్య లౌకికవాద విధానాలను అవలంభిస్తూ, ఎన్నో కార్యక్రమాలతో ముస్లింల న్యాయమైన హక్కులను సాధించేందుకు కృషిచేసినట్టు గుర్తుచేశారు. అధ్యక్షత వహించిన షేక్ ఖలీల్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఎంయూఎఫ్‌ను గుంటూరు ఉమ్మడి జిల్లాలో బలోపేతం చేసేందుకు 17 నియోజకవర్గాల్లో కమిటీల ఏర్పాటుకు ముఖ్యనేతలంతా కృషిచేయాలని కోరారు. ముస్లింలను రాజకీయంగా చైతన్యపరచాల్సిన అవసరం ఉన్నందున ముస్లిం యునైటెడ్ ఫ్రంట్‌కు అనుబంధంగా రాజకీయ చైతన్య వేదిక ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను సమావేశంలో ప్రవేశపెట్టారు. సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించటంతో తీర్మానం చేశారు. గుంటూరు జిల్లా ముఖ్య నాయకులు షేక్ కరీముల్లా (ప్రత్తిపాడు), ఎంఏ సాలార్ (వినుకొండ), షేక్ ఇబ్రహీం (పెదకూరపాడు), మెమన్ భాష, సయ్యద్ జాఫర్ (పొన్నూరు), సయ్యద్ జాకీర్ హుస్సేన్ (తాడికొండ), సయ్యద్ ఆదమ్ సాహెబ్ (గుంటూరు వెస్ట్), సయ్యద్ గౌస్ బాషా, షేక్ వహీద్ (గుంటూరు ఈస్ట్)తోపాటు తెనాలి నియోజవర్గంలోని మండలాల నాయకులు పాల్గొన్నారు.



తెనాలి సమావేశంలో ఎంయూఎఫ్ నేతలు

నేడు రైతుల నిరసన దీక్ష

చిలకలూరిపేట: నల్లబర్లీ పొగాకును వెంటనే కొనుగోలు చేయాలని మంగళవారం ఉదయం 10 గంటలకు ఐటీసీ కంపెనీ వద్ద రైతుల నిరసన దీక్ష నిర్వహిస్తున్నట్లు రైతు సంఘాల సమన్వయ సమితి సభ్యులు తెలిపారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సమక్షంలో పొగాకు కంపెనీలు అంగీకరించిన విధంగా కొనుగోళ్లు చేయకపోవడంతో ఈ దీక్ష చేపట్టినట్లు వెల్లడించారు. క్వింటా ఒక్కంటికి గత ఏడాది కొన్న రూ.15 వేలకు తక్కువ కాకుండా బర్లీ పొగాకు కంపెనీల చేత ప్రభుత్వం కొనిపించాలన్నారు. పొగాకు కంపెనీలు న్యాయమైన ధరకు కొనుగోలు చేయకపోతే మార్క్‌ఫెడ్ ద్వారా కొని రైతులను ఆదుకోవాలన్నారు. పొగాకు బోర్డు పరిధిలోకి బర్లీ పొగాకును చేర్చాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఐటీసీ కంపెనీ ముందు నిర్వహిస్తున్న నిరసన దీక్షలో రైతులు, రైతు సంఘాల నాయకులు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అవగాహనతోనే నకిలీలకు అడ్డుకట్ట

- విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి
- కొనుగోలు సమయంలో రశీదు తప్పనిసరి

కొరిటెపాడు(గుంటూరు): ఖరీఫ్ సీజన్ సమీపిస్తుండటంతో రైతులు పొలం పనులకు సమాయత్తమవుతున్నారు. జూన్ నెల నుంచి ఖరీఫ్ సీజన్ విత్తనాలు చల్లే పనులు ప్రారంభం అవుతాయి. రైతుల అవసరాన్ని ఆసరాగా తీసుకుని కొందరు వ్యాపారులు నకిలీ విత్తనాలు అంటగట్టి అందినంత దోచుకునేందుకు అదునుగా ఎదురుచూస్తున్నారు. వీరి బారిన పడకుండా ఉండాలంటే రైతులు అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే వ్యాపారులు చేస్తున్న అక్రమాలను గుర్తించి ప్రశ్నించగలరని అధికారులు చెబుతున్నారు.

అన్నింటా మోసం..

విత్తనాలు కొనుగోలు చేసి పొలంలో వేసుకున్న తర్వాత మొలకలు పూర్తిగా రాకపోవడం, తక్కువ శాతం మొలకలు రావడం జరిగితే నాశిరకం విత్తనాలు ఇచ్చి వ్యాపారి తమను మోసం చేశారని రైతులు అనుకుంటారు. ఒక్క విత్తనాలు అనుకుంటే పొరపాటే. విత్తనాలతో పాటు ఎరువులు, పురుగు మందులు.. ఇలా ప్రతి వ్యాపారంలోనూ మోసాలు జరుగుతుంటాయి.

పరిశీలన తప్పనిసరి..

ప్రభుత్వ అనుమతి పొంది వ్యాపారం చేస్తున్న డీలర్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి. రశీదులు(బిల్లులు) ఇవ్వని దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేయకపోవడమే మంచిది. కొనుగోలు చేసిన విత్తనాల సంచుల(బ్యాగ్)కు సీల్ వేసి ఉన్నాయో? లేదో? చూసుకోవాలి. సీల్ వేసి ఉన్న సంచులనే కొనుగోలు చేయాలి. సంచులపై కంపెనీ పేరు, తయారీ, గడువు తేదీలు, నికర బరువు, విత్తన రకం, తేమ శాతం.. తదితర అంశాలను సరిచూసుకోవాలి. పొలంలో విత్తనాలు వేసుకున్న తర్వాత సంచులను, రశీదులను, సంచులపై ఉన్న సమగ్ర వివరాలను తెలియజేసే పత్రాలను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి. విత్తనాలు కొనుగోలు సమయంలో మోసం జరిగితే వినియోగదారుల చట్టం ప్రకారం పరిహారం పొందేందుకు ఇవే కీలకమవుతాయి.



విత్తనాలు విత్తేందుకు భూమిని సిద్ధం చేసిన లాలుపురం రైతులు



ఏపీ సీడ్స్ వరి బస్తాలు (ఫైల్)

నకిలీలను గుర్తిస్తే..

పొలంలో వేసిన విత్తనాలకు మొలకలు రాకపోతే నకిలీ విత్తనాలుగా భావిస్తారు. దిగుబడి పూర్తిగా రాకపోయినా నకిలీ విత్తనాలుగానే భావించవచ్చు. వెంటనే వ్యవసాయశాఖ ఏఓ, ఏడీఏ, డీఏఓ, పోలీసులకు అన్ని రకాల రశీదులతో రైతుకు జరిగిన నష్టాన్ని, విత్తనాలు ఎక్కడ కొనుగోలు చేశారో తెలియజేస్తూ ఫిర్యాదు చేసి రశీదు ఉంచుకోవాలి. ధ్రువీకరించేందుకు శాస్త్రవేత్తలను అధికారులు తీసుకువస్తారు. పోలీసులు, వ్యవసాయాధికారులు ఇచ్చిన నివేదికల ఆధారంగా వినియోగదారుల ఫోరంలో కేసు వేస్తే రైతులకు న్యాయం జరుగుతుంది.

–నున్నా వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి, గుంటూరు.

డల్లాస్‌లో వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం



డల్లాస్‌లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులతో కిరణ్‌కుమార్‌రెడ్డి, సుధాకర్‌బాబు, తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు సుపరిపాలన, సంక్షేమం దక్కాయని అవర్ స్టేట్.. అవర్ లీడర్ సభ్యుడు అప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. యూఎస్ఏ పర్యటనలో ఉన్న కిరణ్‌కుమార్ రెడ్డి సోమవారం డల్లాస్‌లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రజల్లో విశ్వసనీయత, ఆదరాభిమానాలు పొందారని అన్నారు. ప్రజా సంక్షేమంతో పాటు వారి కుటుంబాలు, పిల్లల అభివృద్ధిని తన ఆనందంగా భావించి, ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదగాలని ఆశించారని అన్నారు. యుఎస్ఏలోని అవర్ స్టేట్ – అవర్ లీడర్ సభ్యుడు శివ అన్నపురెడ్డి మాట్లాడుతూ ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారిని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలోని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొందని, సంక్షేమ కార్యక్రమాలను నిర్విరామంగా అమలు చేసేందుకు కోవిడ్ ప్రభావంతో రెండేళ్ల పాటు ఎన్నో ఆర్థికపరమైన సవాళ్లను ఎదుర్కొన్నారని తెలిపారు. సంతమాగులూరు మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్పటి నుంచి కక్ష సాధింపు చర్యలు, అరెస్టుల పర్వం మినహా ప్రజా సంక్షేమం, ఆర్థికాభివృద్ధి సాధించాలనే ఆలోచన లేకుండా పోయిందన్నారు. ఈసందర్భంగా అవర్ స్టేట్ – అవర్ లీడర్, ఇంటలెక్చువల్ ఫోరమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.శాంతమూర్తి మాట్లాడుతూ గ్రూపునకు చెందిన 700కు పైగా సభ్యులు రాష్ట్రంతో పాటు వివిధ రాష్ట్రాలు, దేశాల్లో వైఎస్ జగన్ నాయకత్వాన్ని బలపర్చేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రమణారెడ్డి, డాక్టర్ రామిరెడ్డి, ప్రసాద్ భీమవరపు, సాంబిరెడ్డి, పాల్ రెడ్డి, దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ సైట్‌లో హెచ్‌ఎం పోస్టుల సీనియార్టీ జాబితా

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జెడ్పీ, నగరపాలకసంస్థ, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తూ, హెచ్‌ఎం పోస్టుల ఉద్యోగోన్నతులకు అర్హులైన ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాను deognt.blogspot.in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీనియార్టీ జాబితాలో పొందుపర్చిన ఉపాధ్యాయులు విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ ధ్రువపత్రాలు, అటెస్టేషన్ చేయించిన రెండు సెట్ల కాపీలు, సేవా పుస్తకంతో మంగళవారం ఉదయం 10 గంటలకు పాత బస్టాండ్ సెంటర్లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని జిల్లా పరీక్షా భవన్‌లో జరిగే ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో బదిలీలకు దరఖాస్తు చేసుకున్న ప్రైమరీ హెచ్‌ఎం సీనియార్టీ జాబితాను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ సీవీ రేణుక తెలిపారు. జాబితాపై అభ్యంతరాలు ఉన్న పక్షంలో మంగళవారం సాయంత్రంలోపు డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

నేడు గ్రేడ్–2 హెచ్‌ఎం ఉద్యోగోన్నతుల ధ్రువపత్రాల పరిశీలన

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జోన్–3 పరిధిలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్, తత్సమాన కేడర్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి కల్పించేందుకు మంగళవారం ఉదయం 9 గంటలకు గుంటూరులోని ఆర్జేడీ కార్యాలయంలో ధ్రువపత్రాలను పరిశీలించనున్నట్లు ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలోని ప్రభుత్వ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు తమ సర్వీసు రిజిస్టర్, సామాజిక ధ్రువీకరణ పత్రం ఒరిజినల్, విద్యార్హతల సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. ఇందుకు సంబంధించిన స్కూల్ అసిస్టెంట్ సీనియార్టీ జాబితాలో సీరియల్ నంబరు 01 నుంచి 75 వరకు పేర్లు ఉన్న వారు తప్పక హాజరు కావాలని తెలిపారు.

‘సాతి’పై అవగాహన కార్యక్రమం

గుంటూరు లీగల్: హైకోర్ట్ ఆదేశాల మేరకు నాల్గో అదనపు జిల్లా జడ్జి ఆర్.శరత్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం స్టేక్ హోల్డర్స్‌కు ‘సాతి’ (సర్వే ఫర్ ఆధార్ అండ్ యాక్సిస్ త్రూ ట్రాకింగ్, హోలిస్టిక్ ఇంక్లూషన్) పై ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ పాల్గొని సాతి డిస్ట్రిక్ట్ కమిటీ విధి, విధానాల గురించి వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, ఆధార్ నమోదు, న్యాయ సహాయం, సంక్షేమ పథకాలతో అనుసంధానం ద్వారా అనాథ పిల్లలను గుర్తించి, వారికి సహాయం చేయడానికి సాతి కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏ ఒక్క బిడ్డ గుర్తింపు లేకుండా, వారి హక్కులు, అర్హతలకు దూరంగా ఉండకుండా చూసుకోవడమే దీని ప్రధాన లక్ష్యమన్నారు. వీధి బాలలు, అనాథలు, రక్షించబడిన పిల్లలు వంటి 18 సంవత్సరాల లోపు నిరాశ్రయులైన పిల్లలందరికీ చట్టపరమైన గుర్తింపును అందించడం, వారికి ప్రభుత్వ పథకాలు, విద్య, ఆరోగ్యం, రక్షణ సేవలను అందించడం జరుగుతుందన్నారు. ఈ కమిటీలో సెక్రటరీ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, చైర్ పర్సన్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి యూఐడీఏఐ ప్రతినిధి, ప్రతి తాలూకా తహసీల్దార్లు, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా ఆరోగ్య అధికారి, సివిల్ సర్జన్, జిల్లా శిశు అభివృద్ధిశాఖ అధికారి, జువెనైల్ యూనిట్ నుంచి పోలీస్ అధికారి, అనాథ శరణాలయాలు, బాలల సంరక్షణ సంస్థల ప్రతినిధులు ఐదుగురు, ప్యానల్ లాయర్లు నలుగురు, పారా లీగల్ వలంటీర్లు నలుగురు సభ్యులుగా ఉంటారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ఆర్.శరత్‌కుమార్

కీటక జనిత వ్యాధులపై అప్రమత్తత అవసరం

డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో దోమలు వృద్ధి చెంది వ్యాధులు వ్యాప్తి చెందకుండా అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి సూచించారు. డీఎంహెచ్ఓ కార్యాలయంలో సోమవారం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్లతో కీటక జనిత వ్యాధుల నివారణపై సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎంహెచ్ఓ మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా యాంటీ లార్వా మెజర్స్ అమలు చేయాలన్నారు. అడల్ట్ మస్కిటో మెజర్స్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. డెంగీ, మలేరియా వంటి దోమ కాటు వ్యాధులను గణనీయంగా తగ్గించేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత వల్ల దోమలు దరిచేరవని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, అసిస్టెంట్ మలేరియా అధికారి రాజునాయక్, ఏఎంఓ ప్రభాకర్‌రెడ్డి, ఘంటసాల శ్రీనివాసరావు, నరేంద్రబాబు, ప్రశాంత్, సబ్ యూనిట్ ఆఫీసర్లు శేషగిరిరాజు, శ్రీమన్నారాయణ, శిగణేష్ పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

అ‘పూర్వ’ సమ్మేళనం

- తెనాలి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ జూనియర్ కాలేజీ 1995–97 బ్యాచ్ ఇంటర్ పూర్వ విద్యార్థుల సమావేశం
- 28 సంవత్సరాల తర్వాత కలుసుకున్న మిత్రులు

గుంటూరు మెడికల్: తెనాలి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మెమోరియల్ జూనియర్ కాలేజీలో 1995–97 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం మంగళగిరిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కలుసుకున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో, ఇతర రాష్ట్రాల్లో వివిధ వృత్తుల్లో, హోదాల్లో స్థిరపడిన మిత్రులంతా 28 సంవత్సరాల అపూర్వ వేడుకలకు హాజరై ఆనందాన్ని పంచుకున్నారు. పలువురు తమ కుటుంబ సభ్యులతో హాజరై కాలేజీ రోజుల్లో చేసిన చిలిపి పనులు గుర్తు చేసుకుని నాటి జ్ఞాపకాల్లో విహరించారు. సీఐలు రాంబాబు, రమేష్, ఎస్ఐ రాజారావు, కానిస్టేబుళ్లు సుబ్బారావు, ఆనంద్, బాబూరావు, కోటి, సుబ్బు, సీఆర్పీఎఫ్‌కు చెందిన అనిల్, పలువురు వైద్య సిబ్బంది వేడుకల్లో పాల్గొన్నారు.



మంగళగిరిలో సమావేశమైన మిత్రులు